# అప్పిచ్చువాడు

**నమ్మిన చోటే మోసానికి ఆస్కారం ఉంది. కానీ, నమ్మడానికీ, మోసపోవడానికీ మధ్యనున్న సన్నటి విభజన రేఖను విస్మరించినప్పుడు నమ్మకం అపనమ్మకంగా తయారై జీవితాన్ని అల్లకల్లోలం చేస్తుంది**

**చూస్తూ చూస్తూ ఇరవై అయిదు వేలు అతని చేతిలో పెడుతుంటే ఎందుకనో మనసులో**

ఆఫీను నుండి నేరుగా ఇంటికి రండి. మరో సంగతి. ఏ వాహనమూ ఎక్కకుండా నడిచి వస్తే ఒళ్ళు కాస్త తగ్గుతుంది. ఆరోగ్యానికీ మంచిదే" అంటూ నా శ్రీమతి తాయారు ఇచ్చిన సలహాని తు.చ తప్పకుండా క్రమంగా పాటించాలన్న సధుద్దేశం ఉన్నవాణ్ణి. అందుకే ఆఫీసులో నాలుగో గంట కొడుతూనే ఫైళ్ళు మూసేసి బీరువాలో పడేసి చెరువు గట్టమ్మట ఇంటికి దారి పడుతూ ఉంటాను. ఆ దారిన నడిస్తే ఆఫీను నుండి ఇంటికి రెండు కిలోమీటర్ల దూరం. అటు చెరువు నుంచి చల్లని గాలి, ఇటు నిద్ర గన్నేరు చెట్లకింద చిక్కని నీడ. అసలు నడుస్తున్న అలుపే ఉండదు.

ఒకరోజు సాయంత్రం ఒడ్డును తాకుతున్న కెరటాలతో పోటీపడుతూ అటూ ఇటూ గంతుతున్న చేప పిల్లల్ని చూస్తూ నడుస్తున్నానేమో కాలికి రాయి తగిలి తూలి పడబోయి ఎలాగో సంబాళించుకున్నా.

"ఒరేయ్ రామం, ఉండుండు" అంటూ వెనుక నుంచి కేక వినిపించేసరికి ఆగి వెనక్కి తిరిగి చూశా. నా స్నేహితుడు శ్యాంబాబు చాలా రోజుల తరువాత కనిపించాడు. రొప్పుతూ వచ్చి నా ముందు నిలబడ్డాడు.

"మరీ అంత జెట్ స్పీడ్ నడక అయితే ఎలారా నాయనా" అన్నాడు ఆయాసపడిపోతూ.

"చూడు గుండె ఎలా కొట్టుకుంటోందో" అన్నాడు రెండు చేతులూ గుండెపై ఉంచుకొని, కళ్ళింతలు చేసుకొని చూస్తూ.

"చాలా రోజులకి కనిపించావే. ఏమిటి సంగతి? అంతా బాగున్నారా శ్యామ్" అన్నా ఆప్యాయంగా వాడివైపు చూస్తూ.

"ఆఁ. అంతా బాగానే ఉన్నాం కానీ... బాబ్బాబు, ఇవి చేతులు కావనుకోరా" అంటూ గబుక్కున నా చేతులు పట్టేసుకున్నాడు.

"ఇంత స్పష్టంగా ఇవి చేతుల్లా కనిపిస్తుంటే కావని ఎలా అనుకునేదిరా" అన్నా వస్తున్న నవ్వు ఆపుకొంటూ.

"అయితే, కాళ్ళు పట్టుకోనా మరి" అంటూ వంగబోయాడు శ్యాంబాబు ఎంతో మర్యాద నటిస్తూ సినిమా ఫక్కీలో.

"అంతపని చేయనక్కర్లేదుగానీ, ఇంతకీ ఏమిటి సంగతి" అన్నా వాడు వేసుకున్న క్రీమ్ కలర్ టీషర్ట్ వైపు చూస్తూ.

"రామం, నీ నుండి ఒక హెల్ప్ కావాలిరా" అన్నాడు దీనాతిదీనంగా ముఖం పెట్టి.

"ఏమిటో చెప్పు" అన్నా వాచ్‌వైపు చూసుకుంటూ. అర్ధగంటలో ఇంట్లో వాలకపోతే ఇల్లాలితో పోరు.

"తప్పకుండా చేస్తానని ప్రామిస్ చేస్తేనే చెప్తా"

"చేయగలనో, లేదో తెలియకుండా ప్రామిస్ ఎలా చేసేది?"

"తప్పకుండా చేయగలవురా."

"అయితే సరే. ప్రామిస్. ఇప్పుడు చెప్పి ఏడువ్."

"టౌన్ బాంక్‌లో వేసిన ఎఫ్.డి ఎమౌంట్ ఇరవై అయిదు వేలు రేపటికి మెచ్యూర్ అవుతుంది కదూ" అన్నాడు శ్యాంబాబు డిటెక్టివ్‌లా పోజు పెట్టి.

"అవును. అయితే" అన్నా అతని జ్ఞాపకశక్తికి ఆశ్చర్యపోతూ.

ఆరు నెలల క్రితం ఎరియర్స్ రూపంలో వచ్చిన ఇరవై అయిదువేలు ఎఫ్.డిలో వేసి వస్తుంటే బ్యాంక్ మెట్ల దగ్గర తారసపడ్డాడు. అడిగితే చెప్పా ఫలానా రోజున ఎఫ్.డి మెచ్యూర్ అవుతుంది అని.

"బాబ్బాబు, చచ్చి నీ కడుపున పుడతారా. ఆ క్యాష్ నాకు కాస్త సర్దరా రామం. వారం రోజుల్లో మళ్ళీ నీ డబ్బు నీకు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తా" అన్నాడు ఎంతగానో బతిమాలుతూ.

గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లు అయింది నా పని. "సారీరా శ్యాం. ఆ దుడ్డు నీకు ఇచ్చానసుకో, నా పెళ్ళాం నాపై దుడ్డుకర్ర తిరగేస్తుంది" అన్నా నవ్వేస్తూ, కాస్త మొహమాటంగా చూస్తూ.

"అసలు చెల్లెమ్మకి తెలిసే ప్రమాదమే రాదులేరా. వారం అంటే వారం. సరిగ్గా ఏడు రోజులు. అంతే. ఎనిమిదో రోజుకంతా నీ డబ్బు నీ చేతిలో ఉంటుంది పదిలంగా. ఇది నా హామీ" అన్నాడు శ్యాంబాబు నా చేతిలో చేయి వేస్తూ, ఒక రాజకీయ నాయకుడిలా పోజు పెడుతూ.

"అంత అవసరం ఏం వచ్చిందిరా" అన్నా కాస్తంత మెత్తబడుతూ.

ఓ క్షణం అటూ ఇటూ దిక్కులు చూశాడు. ముఖంలో కంగారు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

"మా బంధువుల్లో ఒకామెకు సీరియస్‌గా ఉందిరా. అర్జంటుగా ఆపరేషన్ చేయాలంటున్నారు డాక్టర్లు" అన్నాడు చివరికి.

"అసలు నాకు రావాల్సిన పైకం నాలుగు రోజుల్లోనే రావచ్చు. అప్పుడిక వారం రోజుల టైము కూడా అక్కర్లేదురా రామం" అంటూ మళ్ళీ హామీ ఇచ్చాడు.

ఓ మనిషికి ఒంట్లో బాగాలేదని చెప్పడంతో, ఇక డబ్బు సర్దనని అనడానికి నోరు రాలేదు నాకు.

"సరేలే. రేపు ఆఫీసుకు రా లంచ్ టైమ్‌లో. బ్యాంక్ నుండి తీసి ఉంచుతా" అన్నా నీళ్ళలో రాళ్ళు విసురుతూ గంతులేస్తున్న పిల్లమూకను చూస్తూ.

"నాకు తెల్సురా నువ్వు కాదనవని. వెన్నలాంటి మనసురా నీది" అంటూ ఓ పొగడ్త బాణం నాపై విసిరి, పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ హుషారుగా వెళ్ళిపోయాడు శ్యాంబాబు.

ఓ క్షణం అతను వెళుతున్న దిక్కువైపు చూస్తూ నిల్చుండిపోయి మళ్ళీ నా నడక మొదలుపెట్టా.

నేనూ, శ్యాంబాబు చిన్ననాటి స్నేహితులం. ఒక ఊరివాళ్ళం. ఇంటర్‌వరకూ ఒకే క్లాసువాళ్ళం. ఆ తరువాత అతనొక ఊళ్ళో, నేను మరో ఊళ్ళో డిగ్రీలు పూర్తిచేశాం. వేరువేరు ఊళ్ళల్లో ఉద్యోగాలు వెలగబెట్టాం. అనుకోకుండా సంవత్సరం క్రితం ఇద్దరికీ ఒకే ఊరికి ట్రాన్స్‌ఫర్ అయింది. మా ఇద్దరి ఆఫీసులు కొంచెం దగ్గరే అవడంతో అప్పుడప్పుడూ కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకునే వాళ్ళం. శ్యాంబాబు ఓ నాలుగుసార్లు భార్యాపిల్లల్ని తీసుకుని మా ఇంటికి వచ్చాడు. మేమూ ఓ రెండుసార్లు వాళ్ళింటికి వెళ్ళాం.

"భలే చలాకీగా ఉన్నాడండీ మీ స్నేహితుడు. మీరేమో పలుకే బంగారమా అన్నట్లుంటారు. ఎలా కుదిరిందండీ మీ ఇద్దరికీ మధ్య ఇంతలావు స్నేహం" అంటూ అప్పుడప్పుడూ ఆటపట్టిస్తూ ఉంటుంది తాయారు.

ఏమిటో 'అంత అర్ధంతరంగా వచ్చి, 'ఓ వారం రోజులకి డబ్బు సర్దవా' అని అడిగేసరికి కాదనలేకపోయా. ఇంతకుముందెన్నడూ అలాంటి పరిస్థితి తారసపడలేదు నాకు.

వారం రోజుల్లో డబ్బు సర్దుతానన్నాడు శ్యాంబాబు. సర్దగలడో, లేదో? తాయారుకి తెలిస్తే తాటాకులు లేపేస్తుంది అనుకుంటూ నిదానంగా ఇంటికి చేరుకున్నా.

రాత్రి భోజనాలయ్యాక తాయారు తీరిగ్గా అడగనే అడిగింది ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ- "రేపు మన ఎఫ్.డి మెచ్యూర్ అవుతుంది కదండీ" అంది ఎంతో ఒయ్యారంగా వక్కపొడి డబ్బా అందిస్తూ.

మామూలుగా అయితే తాయారు జ్ఞాపకశక్తిని మెచ్చుకొనేవాడినే కానీ, ఆ క్షణంలో మాత్రం కుడితిలో పడ్డ ఎలుకలా ఉక్కిరిబిక్కిరి అయ్యాను. అప్పటికి మాత్రం వినీవిననట్లు ఊరకొని, ఆ తరువాత దొంగ నిద్ర నటిస్తూ, జవాబు ఏదీ చెప్పకుండా తప్పించుకోగలిగాను ప్రస్తుతానికి.

మర్నాడు లంచ్ టైమ్‌కి టంచనుగా రానే వచ్చాడు శ్యాంబాబు. చూస్తూ చూస్తూ ఇరవై అయిదు వేలు అతని చేతిలో పెడుతుంటే ఎందుకనో మనసులో కాస్త కంగారనిపించింది. చేతులు వణికాయి. నేను చేస్తున్న పని సమంజసమా, కాదా అన్న సందిగ్ధంలో పడిపోయాను కాసేపు.

"వస్తా రామం. నీకెలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావట్లేదురా. చూస్తుండు. ఎనిమిదో రోజుకంతా... అవును, సరిగ్గా ఎనిమిదో రోజుకంతా ఈ డబ్బు పదిలంగా నీ చేతిలో ఉంటుంది. సరేనా? అసలు ఈ లోపలే ఇచ్చేస్తానేమోలే" అంటూ

వచ్చినంత స్పీడుగా వెళ్ళిపోయాడు శ్యాంబాబు నోట్లకట్టలు బ్యాగ్‌లో వేసుకొని. 'అంత డబ్బు ఇచ్చినట్లు ప్రూఫ్ ఏమిటి' అని వివేకం గోల చేస్తున్నా, వారం రోజులకి ఏం బాండు రాయించు కునేదిలే, అదీ ఒక స్నేహితుని దగ్గర అంటూ మనసుకు సర్ది చెప్పుకొని మౌనంగా ఉండిపోయా.

సాయంత్రం ఇంటికి వెళుతూనే టీ కప్పుతో. నవ్వుతూ ఎదురొచ్చింది తాయారు. ఆ నవ్వు చూస్తుంటే మరింత ఇబ్బంది అనిపించింది. సూటిగా ఆమె కళ్ళలోకి చూడలేకపోయా.

"డబ్బు తెచ్చారా" అంది నవ్వుతూ, ఆ చిరునవ్వు నాణ్యం తగ్గనీయకుండా.

మరింత కంగారు ఎక్కువయింది నాకు. శ్యాంబాబుకి ఇచ్చానని చెప్పడం, తాయారు గోల చేసి గంతులు చిందులు వేయడం, అరవడం, అలగడం... అనవసరంగా ఎందుకీ తంటా అంతా. ఓ వారం రోజులు ఎలాగోలా తప్పించుకొంటే సరిపోయె అనిపించింది.

"అరే, మర్చిపోయా తాయారూ. ఆఫీసులో ఊపిరి పీల్చుకోవడానికి కూడా తీరనంత పని ఉండింది. ఇన్‌స్పెక్షన్ జరుగుతోంది" అంటూ తోచిన అబద్ధం ఆడి తప్పించుకోవడానికి ప్రయత్నించా.

"ఇదేం విడ్డూరమండీ. వారం క్రితమేగా ఇన్‌స్పెక్షన్ జరిగిందీ? వారంవారం ఉంటుందా ఏమిటీ మీ ఆఫీసులో" అంటూ నిలదీసింది తాయారు.

'ఓసి నీ జ్ఞాపకశక్తి మండా' అని మనసులో తిట్టుకుంటూ, "ఇదొక స్పెషల్ ఇన్‌స్పెక్షన్ లే" అంటూ తల తిప్పుకున్నా. బతుకు జీవుడా అనుకుంటూ మ్యాగజైన్‌లో తల దూర్చేశా.

మర్నాడు ఆఫీసుకు వెళుతుంటే మరీ మరీ గుర్తు చేసింది తాయారు "ఈ రోజన్నా వెళ్ళండి బ్యాంక్‌కి" అంటూ.

"సరే" అంటూ తల ఆడిస్తూ ఆఫీసుకి దారి పట్టా, సాయంత్రానికి ఏం వంక చెప్పాలీ అని ప్లాన్ వేసుకుంటూ.

"బ్యాంక్ దగ్గర విపరీతమైన రష్ ఉంది తాయారూ" అని ఒక రోజు, "బ్యాంక్ టైమయి పోయింది నే వెళ్ళేసరికి" అని మరో రోజు, "తల నొప్పి ఎక్కువగా ఉండి వెళ్ళలేక పోయా"నని ఇంకొక రోజు- అలా రోజుకో రకం అబద్ధం సృష్టించి వారం గడిపే సరికి తల ప్రాణం తోకకు వచ్చింది.

పోనీ నిజం చెప్పేస్తే పోలా అని అనిపించింది కానీ, నిజం చెప్తే ఇంట్లో టపాకాయలు మోగిపోతా యని నాకు తెలుసు. అప్పు ఇవ్వడం, అప్పు తీసుకోవడం - ఈ రెండు పనులూ తాయారుకి గిట్టవు. ఒళ్ళంతా కారం పూసుకున్నంతగా చిరాకు పడిపోతుంది. ఆ కోపంలో నన్నో నాలుగు తిట్టి, పిల్లల్ని చావబాది, నానా యాగీ చేస్తుంది. అదీ నా భయం. అందుకే రోజుకో అబద్ధాన్ని ఆశ్రయిస్తూ వారం రోజులూ గడిపేశా. పగలు ఎలాగోలా గడిచేది కానీ, రాత్రవుతూనే రకరకాల సందేహాలు సరదాగా నతాయించేవి. చూస్తూ చూస్తూనే ఎనిమిదో రోజు రానే వచ్చింది. సాయంత్రం దాకా ఎంతో ఆశతో, ఆతురతతో ఎదురు చూశా శ్యాంబాబు కోసం. అతని జాడెక్కడా లేదు. ఆఫీసు నుండి ఫోన్ చేద్దామనుకున్నా గానీ, మొహమాటం అడ్డొచ్చి ఆ ప్రయత్నం మానుకున్నా. మర్నాడు తెచ్చిస్తాడేమోలే అని సరిపెట్టుకున్నా చివరికి.

"మీరు ఈ రోజూ మర్చిపోయారా" అంటూ వ్యంగ్యంగా చూస్తూ మూతి మూడు వంకరలు తిప్పింది తాయారు.

కాసేపు చిర్రుబుర్రులాడింది. "సరే, మీరు తెచ్చినప్పుడే తెండి. బంగారం రేటు మళ్ళీ పెరిగేలా ఉంది. పాపకో గొలుసుకి ఆర్డరిచ్చేసి వస్తా ఈ రోజు" అంటూ నీటుగా ముస్తాబై బజారు వెళ్ళిపోయింది.

నాకు ఊపిరాడనంత పనయింది. రాత్రంతా నిద్ర లేదేమో ఉదయం లేస్తుంటే తల భారంగా అనిపించింది. నడిచే ఓపిక లేక ఆ రోజుకి ఆటోలో ఆఫీసుకి చేరుకున్నా. ఆ రోజూ శ్యాంబాబు జాడ లేదు. మనసంతా దిగులు ఆక్రమించుకుంది. సాయంత్రం కాళ్ళీడ్చుకుంటూ ఇంటి దారి పట్టాను. దార్లో దూరంగా ఒక చోట శ్యాంబాబు ఆకారం ఒక స్కూటర్ పైన కనిపించి అంతలోనే గబుక్కున మాయం అయిపోయింది.

నన్ను చూసే ఉంటాడు. తప్పించుకు తిరగడం లేదు కదా. అమ్మో, ఎంత మోసం' అనుకున్నా అయోమయంగా అటే చూస్తూ. ముళ్ళకంపల మధ్య కంకర రాళ్ళపై నడుస్తున్నట్లుగా అనిపించింది. అతి కష్టం మీద కాళ్ళు ముందుకు సాగాయి.

రెండు రోజులు ఎదురు చూసి, ఇక లాభం లేదనుకొని, నేరుగా శ్యాంబాబు ఆఫీసుకు వెళ్ళా. నన్ను చూస్తూనే ముఖం నిండా నవ్వు పులుముకుని లేచి నిల్చున్నాడు. "అరే, మంచి ఎండలో వచ్చావ్. అలా క్యాంటీన్‌కి పోదాం పద" అంటూ హడావిడిగా క్యాంటీన్ వైపు లాక్కెళ్ళాడు.

రెండు గోల్డ్‌స్పాట్స్‌కి ఆర్డరిచ్చాడు. తీరిగ్గా సిప్ చేస్తూ నావంక చూశాడు. 'ఏం పనిమీద వచ్చావ్' అన్నట్లుందా చూపు, ఆ వాలకమూ‌న్నూ. ఇక సభ్యత, సంస్కారం, మొహమాటం అన్నీ ఓ పక్కకు నెట్టి డబ్బు సంగతి అడిగా.

"ఏరా శ్యాం, ఎనిమిదో రోజుకంతా డబ్బు నా చేతిలో ఉంటుందన్నావ్? ఏదీ" అన్నా ఖాళీ చేతులు చూపిస్తూ. అదో జోక్ అన్నట్లు బిగ్గరగా నవ్వేశాడు శ్యాంబాబు.

"వారం అంటే లిటరల్లీ వారం అని అనుకుంటే ఎలారా? మరీ అమాయకుడివిలా ఉన్నావ్" అన్నాడు గట్టిగా నా భుజంపై ఒక దెబ్బ వేస్తూ.

గుండె ఆగినంత పనయింది నాకు.

"అదేంట్రా. వారంకంతా ఇస్తానంటేనే కదా నీకు డబ్బిచ్చింది. ఇంట్లో తుపాను మొదలయింది తెల్సా" అన్నా అయోమయంగా చూస్తూ.

"మరీ అంత వర్రీ అవకు బ్రదర్. నాకు ఇవ్వాల్సిన వాళ్ళు ఇంకా ఇవ్వలా. ఇవాళా, రేపూ అంటున్నారు. మరి నేను నీలాగా వర్రీ అవుతున్నానా ఏమిటి చెప్పు? కాస్త ఓపిక పట్టు మహాశయా. త్వరలో ఇచ్చేస్తాగా" అంటూ హామీ ఇచ్చేసి తెలిగ్గా సాగనంపేశాడు.

**కాస్తంత కంగారనిపించింది. చేతులు వణికాయి.**


మర్నాడు ఆఫీసుకి వెళ్ళానన్నమాటేగానీ ఫైళ్ళ నిండా నోట్లకట్టలే కనిపిస్తున్నాయ్ ఎగతాళిగా చూస్తూ. ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్లు తయారైంది నా పరిస్థితి.

"ఏం సార్ అలా ఉన్నారు? ఒంట్లో బాగా లేదా" అంటూ పరామర్శించాడు అటెండర్ వెంకటయ్య. యాంత్రికంగా తల ఊపి చెరువు గట్టు వైపు నడక ప్రారంభించా. ఇంటికి వెళ్తూనే ఉసూరుమంటూ మతడ కుర్చీలో కూలబడ్డా. హఠాత్తుగా ఆకాశం మీద నుండి ఒక్క ఉరుము ఉరిమి పడ్డట్లు ముందుకొచ్చి నిల్చుంది తాయారు.

"మీరు డబ్బు ఆ రోజే తీసేశారటగా? ఏం చేశారు" అంటూ గద్దించి అడిగింది. ఆ విషయం ఏలా తెలిసిందో మరి. ఇక నిజం చెప్పడం తప్పదనిపించినా ఎందుకనో మళ్ళీ అబద్ధమే నోటి నుండి బులెట్‌లా దూసుకొచ్చింది.

"మా ఆఫీసరుకి అర్జంటుగా అవసరం అయితే ఇచ్చాలే. రేపో, ఎల్లుండో ఇచ్చేస్తాడు" అంటూ కాళ్ళు

చిత్రాలు: నర్సిం



కడుక్కునే నెపంతో అక్కడి నుండి మెల్లగా నిష్క్రమించా. ఎందుకనో శ్యాంబాబు తీసుకున్నాడని చెప్పలేకపోయా. ఆఫీసరుకి అప్పిచ్చానంటే ఆ సత్కార్యానికి విలువెక్కువ ఉంటుంది అనిపించింది ఆ క్షణంలో.

చాలాసేపు ఏదేదో గొణుక్కుంటూ, పిల్లల్ని విసుక్కుంటూ, వంటింట్లో గిన్నెలు విసిరేస్తూ ఒక చిన్న సైజు గాలిదుమారం సృష్టించి, తరువాత హాయిగా గుర్రుపెట్టి నిద్రపోయింది తాయారు.

నాకైతే శవ జాగారం చేసినట్లయింది. ఆఫీసులో ఎవరి దగ్గర అన్నా అప్పు దొరుకుతుందేమో, ప్రస్తుతానికి ఈ సమస్యకి ఏదో ఒకరకమైన పరిష్కారం దొరుకుతుంది అన్న ఆశతో వాకబు చేయడం మొదలుపెట్టా.

మొదట ఆఫీసులో వాళ్ళంతా నా వంక ఆశ్చర్యంగా చూశారు. జోక్ అనుకుని నవ్వబోయారు. నిజం అని నిర్ధారణగా తెలుసుకున్నాక, "అయితే, శ్యాంబాబుగారు అందరికీ అప్పు లిస్తుంటాడు సార్. ఆయన్ని అడగండి. ఆయన మీకు బాగా తెలుసేమో. చాలాసార్లు మీతో మాట్లాడుతూ ఉండడం చూశాం" అంటూ సలహా ఇచ్చేసి చక్కా వెళ్ళిపోయారు వాళ్ళు.

అప్పటికిగానీ తెలిసింది కాదు నాకు శ్యాంబాబు అప్పులివ్వడం కోసం అప్పులు తీసుకుంటాడని. అతని నైజం ఎలాంటిదో తెలుసుకోకుండా అలా పప్పులో కాలు వేసినందుకు చెంప దెబ్బలు వేసుకున్నా. కానీ, పడవ మునిగాక లంగరు వేసి ఏం లాభం?

ఒక రోజు సాయంత్రం పేరంటానికని వెళ్ళిన తాయారు ముఖం గంటుపెట్టుకుని తిరిగొచ్చింది.

"మీ ఆఫీసరు భార్య కనిపించింది పేరంటంలో. 'ఒకరి

**పసిపిల్లల చేతిలో నుంచి గబుక్కున తాయిలం ఎత్తుకుపోయే కాకి**

దగ్గర అప్పు తీసుకునే కర్మ మాకేం పట్టిందీ' అంది సాగదీసుకుంటూ. మీరు డబ్బు వాళ్ళకి ఇవ్వలేదంటగా" అంటూ నిలదీసింది. ఏన్నో మహా సముద్రాలు అవలీలగా ఈది చివరికి పిల్లకాలువలో పడి చచ్చినట్లు అయింది నా పరిస్థితి.

"ఎవరికో ఒకరికి ఇచ్చానులే. అయినా, తయ్యిమని ఆయన భార్యని పట్టుకుని నిన్నెవరు అడగమన్నారు" అన్నా కోపం నటిస్తూ.

"అడగబట్టేగా మీ బండారం బయట పడిందీ. అయినా, భార్యాభర్తల మధ్య కూడా ఇంత దిక్కుమాలిన రహస్యాలుంటాయని నాకేం తెలుసూ" అంటూ విసురుగా అనేసి విసవిసా వెళ్ళిపోయింది తాయారు.

నాలుగు రోజులు పోయాక మళ్ళీ శ్యాంబాబు ఆఫీసుకి వెళ్ళా. కచ్చితంగా ఆ రోజు తాడో పేడో తేల్చుకోవాలని నిలదీసి అడిగేసరికి నిర్మొహమాటంగా తాను చెప్పాలనుకున్న నాలుగు ముక్కలూ టక్కున చేప్పేశాడు శ్యాంబాబు.

"నువ్ నాకు డబ్బు ఇచ్చినట్లు ఎవరు చూశార్రా రామం? నీకూ, నాకూ తప్ప మూడో కంటికి తెలీదు కదా. అసలు నువ్ నాకు డబ్బే ఇవ్వలేదంటే ఏం చేస్తావ్? అయినా, ఎందుకొచ్చిన గొడవగానీ, నేను నిన్నలా మోసం చేయనులే. అలా దివాలా తీసిన ముఖం పెట్టకు మరి. త్వరలోనే ఇచ్చేస్తా నంటున్నాగా. కాస్తంత ఓపిక పట్టు. మరీ జీడీల పాకంలా సాగదీయకు" అంటూ లౌక్యంగా బెదిరించి నా నోరు మూయించి పంపేశాడు.

పసిపిల్లల చేతిలో నుంచి గబుక్కున తాయిలం ఎత్తుకుపోయే కాకిలా కనిపించాడు శ్యాంబాబు నాకు ఆ క్షణంలో. మనుషుల నైజం గురించి, నేను మోసపోయిన తీరు గురించి ఆలోచిస్తుంటే కాలం స్తంభించినట్లు అనిపించింది.

అప్పులివ్వడం, తీసుకోవడం శ్యాంబాబుకు చాలా ఇష్టమైన హాబీ కావచ్చు గానీ, మరొకరికి కష్టం, నష్టం కలిగించే ఇష్టం అదేపాటి విలువైనది? తాయారు, పిల్లలు మైమరచిపోయి 'ఈ' టీవీలో వస్తున్న తెలుగు సినిమా చూస్తూ పొట్టలు ఉబ్బేటట్లు నవ్వుకుంటున్నారు గానీ నాకుమాత్రం దేనిపైనా మనసు లగ్నం కాలా. కంటిపై కునుకు రాలా. నాలుగు లంఖణాలు చేసినవాడిలా తయారయ్యా చివరికి. పులిమీద పుట్ర అన్నట్లు డబ్బు చేయిజారిపోయే పరిస్థితి మాట అటుంచి, నిజం చెప్పినా నమ్మని స్థితికి చేరుకుంది తాయారు.

ఒక స్నేహితుడిపై నా నమ్మకం పోవడం కంటే కట్టుకున్న భార్యకు నాపై నమ్మకం పోవడం మరింత బాధాకరమైన సమస్యగా తయారై తికమక పెట్టింది.

పోనీ శ్యాంబాబునే తీసుకొచ్చి ఆమె ముందు నిజం చెప్పించుదాం అంటే అతను నిజం చెబుతాడన్న గ్యారంటీ ఏమిటి? అనవసరంగా ఆ ఇద్దరి ముందూ ఫూల్ని అయ్యేబదులు మౌనంగా ఊరుకోవడమే మేలనిపించింది.

ఇది చాలదన్నట్లు మరో కొత్త సమస్య సృష్టించింది తాయారు. నాకెవరితోనో సంబంధం ఉన్నట్లు, ఆ ఎఫ్.డి మొత్తం ఆమెకు ధారబోసినట్లు ఏదేదో ఊహించుకొని ఇక ఇంట్లో ప్రళయం సృష్టించడం మొదలుపెట్టింది. తిండీతిప్పలూ మానేసి, సమయం సందర్భం లేకుండా సాధిస్తూ, గంటల తరబడి ఏడుస్తూ ఆరువారాల్లో ఏడు కేజీల బరువు తగ్గిపోయింది.

అదృష్టం బాగోకపోతే అపవాదులిలాగే చెందుకు తింటాయేమో? ఎంతో నచ్చజెప్పా నేను అలాంటి వాణ్ణి కాదనీ, నాకలాంటి ఉద్దేశం లేదనీ, కేవలం ఓ స్నేహితుడి మోసానికి బలయ్యాననీ. కానీ, ససేమిరా నమ్మనంది తాయారు.


"ఎవరండీ ఆ స్నేహితుడు? అదేం కాదులే. మీకు మరో స్త్రీతో సంబంధం ఉండే ఉంటుంది. ఆ ఇరవై వేలూ దాని ముఖానే పోసి ఉంటారు. అమ్మో, నేనూ నా పిల్లలూ ఏమైపోవాలి? మేం ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటాం" అంటూ సాధింపులు మొదలుపెట్టింది.

మొదట్లో నన్ను నేను రక్షించుకోవడానికి వాదించేవాణ్ణిగానీ, తరువాత విసుగొచ్చి ఆ ప్రయత్నం మానుకొని ఓ చెవిటివాడిలా ఉండిపోవడం నేర్చుకున్నా. ఆ మౌనాన్ని మరో రకంగా అర్థం చేసుకొని, నిజంగానే నాకెవరితోనో సంబంధం ఉందని నిర్ధారణ చేసేసుకుంది తాయారు.

చూస్తూ చూస్తూనే ప్రశాంతంగా సాగిపోయే మా సంసార నౌక బుడుంగున సుడిగుండంలో మునిగిపోయినట్లయింది. ఇంట్లో మనశ్శాంతి అన్నదే కరవైపోయింది. ఇదే సందన్నట్లు పిల్లలు చదువు మానేసి, హోమ్‌వర్కుపై దృష్టిని నిలపడం వదిలేసి, మా పోట్లాటలు వింటూ హాయిగా కాలక్షేపం చేయడం మొదలు పెట్టారు. తాయారు నన్ను తూర్పార పట్టే పద్ధతికి చుట్టు ప్రక్కలవాళ్ళు కిటికీల్లోంచి తొంగి చూడ్డం, నేను వెళుతుంటే గుసగుసలాడుకోవడం, వెనకాల నవ్వుకోవడం లాంటివన్నీ జరిగిపోతుండేవి.

ఒక ఆదివారం నాడు నా బావమరిది సారథి, అతని భార్య సరోజ చెప్పాపెట్టకుండా వచ్చే జడి వానలా ఇంటిముందు వాలారు. టిఫిన్, కాఫీ అందించాక తీరిగ్గా వాళ్ళ ముందు కూర్చొని పమిట చెంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ ఏదేదో చెప్తోంది తాయారు. మంచి ఎమోషనల్ సీన్ అని ఎంజాయ్ చేసేవాణ్ణి అలాంటి సీను ఏదైనా సినిమాలో చూస్తే. కానీ, నవ్వులపాలయిన వాడికి నవ్వేలా వస్తుంది గనుక. గప్‌చుప్‌గా నా గదిలోంచి ఆ తంతు అంతా గమనిస్తూ ఏం ఎరగనట్లు ఉండిపోయా.





"అలా చెరువు గట్టమ్మట తిరిగొద్దామా బావా కాసేపు? ఏం తోచట్లా" అంటూ పక్కన వచ్చి కూర్చున్నాడు సారథి సాయంత్రం అవుతూనే.

నాకు తెలుసు ఎందుకు రమ్మంటున్నాడో. తోచక కాదు, తనకు తోచిన సలహాలు నాలుగు నా ముందు గుమ్మరించడానికి. మనసులో కోపం గడ్డివాములా భగ్గుమంటున్నా పైకి మాత్రం తేలిగ్గా నవ్వుతూ, అతి సహజంగా ఉండడానికి ప్రయత్నిస్తూ అతని వెంట నడిచాను బలిపశువులా.

ఒక చదునైన ప్రదేశం ఎంచుకొని అక్కడ కూలబడ్డాడు సారథి. బోనులో నిలబడ్డ ముద్దాయిలా నిక్కి నిక్కి చూస్తూ నేనూ పక్కనే కూర్చున్నా.

"రామం బావా, నేను మీకంటే చిన్నవాణ్ణి. ఇలా మాట్లాడ్డం భావ్యం కాదుగానీ, తప్పదు మరి" అంటూ ఉపోద్ఘాతం మొదలుపెట్టాడు సారథి కాస్త తటపటాయిస్తూ.

"ప్రొసీడ్" అంటూ నేను గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసరికి తన మనసులోని భయాలు, భావాలు ఒక్కొక్కటీ నా ముందుంచడం మొదలుపెట్టాడు.

"మా తాయారక్క ఎంతో మంచిది. ఎంతో అందంగా ఉంటుంది కూడా. పైగా మీరంటే పడి

చస్తుంది. మీకూ ఆమె అంటే ప్రాణం కదా బావా. మరి ఎందుకిలా మరొకరి మోజులో పడిపోయారు? మీరెంతో తెలివిగలవారు అనుకుంటాం మేం ఎప్పుడూ. అలాంటి మీరే ఇలా..." నావేపు అదోలా చూశాడు.

నవ్వాలో ఏడవాలో అర్థం కాని పరిస్థితి అది.

"అయితే, ఇదంతా నువ్వూ నమ్ముతున్నావన్న మాట. డోంట్ బి సిల్లీ సారథీ. పనిగట్టుకుని నిన్ను పిలిపించి మీ అక్క ఏదో అవాకులు చవాకులు పేలితే అదంతా నువ్వు నమ్మేయడమేనా అసలు" అన్నా చిరాకుపడిపోతూ. ఆశ్చర్యంగా చూశాడు సారథి. అంతలోనే తమాయించుకున్నాడు తెలివిగా.

"నేనంతగా నమ్మలేదనుకో బావా. మీరెంత మంచివారో నాకు తెలీదా ఏమిటి? కానీ, అక్క ఏమిటిలా



అంటోంది మరి" అంటూ నాన్చడం మొదలుపెట్టాడు.

"అవును. డబ్బు ఇచ్చిన మాట నిజమే సారథీ. కానీ, ఇచ్చింది ఆవిడకెవరికో కాదు, వాడికి, నా స్నేహితుడనుకున్నవాడికి. ఒక జిత్తులమారి నక్కకు. నన్ను నమ్ము సారథీ. నాకసలు పరస్త్రీ వ్యామోహం, అలాంటి మోజు, అలాంటి వీక్‌నెస్ ఎప్పుడూ లేదు. నా జీవితంలో మీ అక్క తప్ప మరెవరితో నా కలాంటి బంధం కానీ, అనుబంధం కానీ, సంబంధం కానీ లేదు. ఒట్టు. నిజంగా. నా పిల్లల మీద ఒట్టు" అన్నా గాద్గదిక స్వరంతో, చెమ్మగిల్లిన కళ్ళతో.

నా స్వరంలోనే నిజాయితీ వినిపించిందో, లేక నా కళ్ళల్లోనే నిజం కనిపించిందో గానీ సారథి ఎంతో రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకున్నాడు. అతణ్ణలా చూసేసరికి ఎక్కడ లేని ఉత్సాహం, ధైర్యం పుట్టుకొచ్చాయి. కనీసం ఒక్కరన్నా నా బాధ అర్థం చేసుకున్నారు అన్న ఆలోచన ఎంతో ఊరట నిచ్చింది. అంతా గబగబా చెప్పేశా.

"మీరు మొదట్లోనే అక్కకు నిజం చెప్పేస్తే ఇంత గొడవ ఉండేది కాదు గదా బావా! అనవసరంగా దారినబోయే దానయ్యని నెత్తిన ఎక్కించుకుని లేనిపోని తలనొప్పి కొని తెచ్చుకున్నారు. మంచితనం మంచిదే కానీ, మోతాదుకు మించిన మంచితనం మోతాదుకు మించిన మందులా ముప్పుతెచ్చి ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తుంది. ఎదుటి మనిషి అశక్తతనో, ఆత్మీయతనో ఆసరాగా తీసుకుని అంచెలంచెలుగా అవకాశపు మెట్లెక్కేసి అంత స్తులకు ఎదిగిపోతారు కొందరు. ఆకాశం అంతెత్తున ఎదిగిపోయిన వాళ్ళకు నేలపై నిలకడగా నిలబడి నింగివేపు చూస్తున్న ఆత్మీయులు, ఆసరా ఇచ్చినవాళ్ళూ కనిపించరు" అంటూ కాస్తంత నుస్నితంగా మందలించి వదిలేశాడు సారథి.

కొంచెం సేపు ఆలోచనలో పడ్డాడు.

"మీ స్నేహితుడి అడ్రసివ్వు. వాడు మళ్ళీ మళ్ళీ ఇలాంటి వెధవ పనులు చేయకుండా నాలుగు ఉతుకులు ఉతికేసి వస్తా" అన్నాడు ఆవేశంగా చూస్తూ. నవొచ్చింది నాకు.

"షేక్స్‌పియర్ ఏమన్నాడో తెలుసా? *నైదర్ ఎ బారోయర్ నార్ ఎ లెండర్ బి* అన్నాడు. మానవ నైజాన్ని చక్కగా కాచి వడపోశాడు మహానుభావుడు. చూడు సారథీ, తెలివితక్కువ పని చేసిందేదో చేశాను. ఇంకా వాణ్ణి తన్ని పోలీసు కేసు చేసుకొని నలుగురితో ఇంకా నవ్వించుకోవడం ఎందుకు? ఆ డబ్బు నా కష్టార్జితం. ఆ దేవుడే నాకు సాక్షి. ప్రాప్తం ఉంటే నాది నాకు తిరిగి వస్తుంది. లేదా దాని తల తగలెయ్య, పోతే పోనీ. డబ్బుకంటే ముఖ్యం తాయారు నన్ను సరిగ్గా అర్థం చేసుకోవడం, మా ఇల్లు ఎప్పటిలా ప్రశాంతంగా ఉండడం. అంతే చాలు" అన్నా ఎంతో ఉద్వేగంతో నీటిపై మెరుస్తున్న లేత ఎండని తదేకంగా చూస్తూ. రెండు రోజుల తరువాత తాయారుకి తమ శాయశక్తులా నచ్చజెప్పి వెళ్ళిపోయారు సారథీ వాళ్ళు.

మరికొంత కాలం గడిచింది. శ్యాంబాబు గుర్తొస్తూనే ఒళ్ళంతా కంపరంగా ఉన్నా, ఇక ఆ డబ్బుకు నీళ్ళు వదులుకొని నిశ్చింతగా ఉండే ప్రయత్నంలో పడిపోయాను నేను. అతణ్ణిక డబ్బు గురించి సతాయించి నేను సతమతమయ్యే ఉద్దేశం కూడా మానుకున్నా. ఇంట్లో ఇదివరకంత గాలి దుమారం లేదుగానీ, గాలి దుమారం తరువాత ఏర్పడే నిశ్శబ్దం మాత్రం ఇల్లంతా నిండిపోయింది. తాయారు ఇదివరకటి మనిషిలా మాత్రం మారలేకపోయింది. బహుశా నాపై కలిగిన అనుమాన ఛాయలు ఇంకా వీడలేదేమో. మౌనం, నిశ్శబ్దం కవలపిల్లల్లా ఇంట్లో మా ఇద్దరి మధ్య తిరుగాడుతుంటే ఎంతో అసౌకర్యంగా అనిపించినా, అలజడి లేకపోవడం వల్ల మనసులో అంత అశాంతిగా అనిపించేది కాదు.

ఉగాది మరో రెండు రోజులు ఉందనగా ఒక సాయంత్రం పిడుగులా ఊడిపడ్డాడు శ్యాంబాబు. ఏం ఎరగనట్టు పళ్ళికిలిస్తూ ఇంట్లోకి అడుగుపెట్టాడు. పలకరించాలని కూడా అనిపించక ముభావంగా ఉండిపోయా.

నోట్ల కట్టలు బ్యాగ్ లోంచి తీసి టేబుల్‌పై ఉంచుతూ, "సారీరా రామం. అన్నమాట ప్రకారం ఇవ్వలేకపోయా. ఆలస్యం అయినందుకు ఏం అనుకోకేం" అన్నాడు అదేదో అత్యంత సాధారణ విషయమైనట్లు క్యాజువల్‌గా.

అన్ని రోజులుగా నేను అనుభవించిన నరక యాతన గుర్తొస్తుంటే కోపాన్నీ, ఆవేశాన్నీ అదుపులోకి తెచ్చుకుంటూ సూటిగా అతని కళ్ళల్లోకి చూశా.

"ఏరా, నీకింకా నాపై కోపం పోయినట్లు లేదే. వస్తా. అర్జంటు పని ఉంది" అంటూ నవ్వేసి నా భుజంపై గట్టిగా ఓ చరుపు చరిచి వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు మహానుభావుడు.

వంట చేస్తున్న తాయారు తలుపు వెనుక నిలబడి ఈ తమాషా అంతా చూస్తున్నదల్లా ఒక్క ఉదుటున ముందు గదిలోకొచ్చిపడింది.

"సారీ అండీ. పాపం, నిజం తెలియక ఇంత కాలం మిమ్మల్ని అనుమానించి, అవమానించి నానా యాగీ చేసి, క్రూరంగా హింసించి..." అంటూ ఏడుపు లంకించుకుంది నా పక్కన వచ్చి కూర్చుంటూ.

చేజారిపోయిందనుకున్న డబ్బు చేతికి అందిన ఆనందం కన్నా చేయూతనిచ్చే ఇల్లాలు చేజారిపోనందుకు కలిగిన సంతోషం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. మనిషికి మనశ్శాంతి ముఖ్యం. ఆ మనశ్శాంతినిచ్చే మనిషి మరింత ముఖ్యం కదా మరి.

"ఏవో అర్థాలు, ఏవో అపార్థాలు ఎన్నెన్నో అనర్థాలకు దారితీస్తుంటాయి. జీవితపు రూపురేఖల్నే మార్చేస్తూ ఉంటాయి. పోనీలే ఇప్పటికన్నా నన్ను అర్థం చేసుకున్నావు. థ్యాంక్ గాడ్. అయినా, తప్పంతా నీదే కాదులే. తప్పుడు అంచనా వేసి తప్పటడుగులు నేనూ వేశాగా. సారీ తాయారూ" అన్నా ఎంతో ఆప్యాయంగా తాయారు చేతిని నా చేతిలోకి తీసుకుంటూ.

టేబుల్‌పై నోట్ల కట్టలు నవ్వుతూ చూస్తున్నాయ్ మా వైపు.

వరండాలోంచి కంచు గంటలా వినిపిస్తోంది మా అబ్బాయి వినయ్ గొంతు– "అప్పిచ్చువాడు, వైద్యుడు..." అంటూ ఊరంతా వినబడేటట్లు సుమతీ శతకంలోని పద్యం బట్టీ వేస్తున్నాడు వాడు.

"ఒరేయ్ ఆపరా, ఆపరా వినయ్. నాకు పరమ చిరాగ్గా ఉంది ఆ పద్యం వింటుంటే" అంటూ నిప్పులు తొక్కిన కోతిలా నేను గంతులేస్తూంటే బిక్కముఖం వేశాడు పాపం. ■

మాదిరిగా కనిపించాడు శ్యాం బాబు నాకు ఆ క్షణంలో.